- 5వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం
- నాణ్యమైన బోధన, మెరుగైన వసతులు
- దరఖాస్తుకు ఈనెల 20 వరకు గడువు
- ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష
- జిల్లాలో 16 పాఠశాలలు, 1280 సీట్లు



జఫర్‌గడ్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల

గురుకులం పిలుస్తోంది!



జఫర్‌గడ్, జనవరి 9: విద్యా వికాసానికి గురుకుల విద్యాలయాలు తోడ్పాటునందిస్తున్నాయి. పేదింటి బాల బాలికలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నాయి. చక్కటి విద్యాబోధనతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయి. ప్రభుత్వం గురుకులాల్లో నాణ్యమైన చదువులు, సన్నబియ్యంతో భోజనం, కాస్మోటిక్స్, ఉచిత దుస్తులు, బెడ్ షీట్స్, పుస్తకాలు, ఇలా అన్ని రకాల వసతులు కల్పిస్తోంది. చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ శిక్షణ ఇప్పిస్తోంది. బోధనలో, సౌకర్యాల కల్పనలో కార్పొరేట్ బడులకు దీటుగా గురుకులాలు పనిచేస్తున్నాయి. వీటిలో ప్రవేశాన్ని అందిపుచ్చుకుంటే మంచి భవిష్యత్తును నిర్మించుకునేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, తెలంగాణ రెసిడెన్షియల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఎస్సీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), ఎస్టీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), బీసీ (ఎంజెపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ రెసిడెన్షియల్ విద్యా సంస్థ (టీఆర్ఈఐఎస్) గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులను కోరుతున్నాయి.

జిల్లాలో 16 గురుకులాలు - 1280 సీట్లు

జిల్లాలో మొత్తం 16 గురుకులాలు ఉండగా, అందులో ఎస్సీ గురుకులాలు 5, బీసీ 6, ఎస్టీ 4, తెలంగాణ రెసిడెన్షియల్ గురుకులం ఒకటి చొప్పున ఉన్నాయి. వీటిలో అన్నీ కలిపి బాలికలకు 9, బాలురకు 7 పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్ల చొప్పున (బాలికలకు 720, బాలురకు 560) మొత్తం 1,280 సీట్లు ఉన్నాయి. ప్రవేశపరీక్షలో విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు.

అర్హతలు

విద్యార్థులు జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతూ ఉండాలి. ఇందుకు సంబంధించిన స్టడీ సర్టిఫికేట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ, విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్ల మధ్య.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం రూ.2 లక్షలకు మించకూడదు.

దరఖాస్తు విధానం...

అర్హతలు గల విద్యార్థులు జనవరి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయా లి. ఇంటర్‌నెట్ లేదా మీ సేవా కేంద్రాల్లోనూ సంప్రదించవచ్చు. విద్యార్థి స్టడీ, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటో ను జతపర్చాల్సి ఉంటుంది. వీటి తో పాటు ఆన్‌లైన్‌లో రూ.100లు రుసుము చెల్లించాల్సి ఉం టుంది. ఆయా గురుకులాల్లో ప్రవే శాలు పొందగోరే ఆసక్తి గల విద్యార్థులు హెచ్‌టీటీపీ:///టీఎస్‌డబ్ల్యూఈఆర్ఐఎస్.ఇన్, హెచ్‌టీ టీపీ:///టీజీసెట్.సీజీజీ. జీఓవీ, ఇన్, హెచ్‌టీటీపీ:///ఎంజెపీటీబీసీడబ్ల్యు ఆర్ఈఐఎస్. తెలంగాణ.జీఓవీ.ఇన్, హెచ్‌టీటీపీ:/// టీజీటీ డబ్ల్యుగురుకులం, తెలంగాణ. జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

ప్రవేశ పరీక్ష విధానం

ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఓఎంఆర్ షీట్ విధానంలో ఉంటుంది. పరీక్షను వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రం తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఉంటుంది. ఈ పరీక్షలో తెలుగు (20 మార్కులు), ఇంగ్లీషు (25), గణితం (25), మెంటల్ ఎబిలిటీ (10), పరిసరాల విజ్ఞానం (20 మార్కులు) సబ్జెక్టులలో నాలుగో తరగతి స్థాయిలో వంద ప్రశ్నలు ఉంటాయి.

ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష

అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. గిరిజన గురుకులాలతో పాటు తెలం గాణ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, మహాత్మాగాం ధీ జ్యోతిబాపూలేకు సంబంధించిన పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ఒకే ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్షను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

- సమత, ప్రిన్సిపాల్, సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం, జఫర్‌గడ్



గురుకులాల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నాం. ఉచిత వసతితో పాటు దుస్తులు, పుస్తకాలు, కాస్మెటిక్స్‌తో పాటు భోజనం అందిస్తున్నాం. 5వ తరగతిలో ప్రవేశం పొందితే బాల బాలికలు 10వ తరగతితో పాటు ఇంటర్ వరకు గురుకులాల్లోనే చదువుకోవచ్చు. విద్యార్థులకు ఆయా తరగతుల సబ్జెక్టులపై విషయ పరిజ్ఞానంతో పాటు కంప్యూటర్ విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నాం. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దోహదం

శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల జిల్లా కో-ఆర్డినేటర్



పేద మధ్యతరగతి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు గురుకులాలు దోహదపడుతున్నాయి. బాలబాలికలకు ఆంగ్లమాధ్యమంలో కార్పొరేట్ స్థాయిలో గుణాత్మక విద్యతో పాటు విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రత్యేక శిక్షణ ఇచ్చి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నాం. ఎంతో మంది విద్యార్థులు విద్య, ఉద్యోగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతూ ఉన్నత స్థితికి చేరుకుంటున్నారు.



గురుకులాల్లో ప్రవేశాల పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య (ఫైల్)

వంటకు తంటాలు!

పదిరోజులుగా భారత్ గ్యాస్ వినియోగదారుల అవస్థలు

ఐదు మండలాలకు నిలిచిపోయిన పంపిణీ

ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ హాస్టళ్ల ఇన్‌చార్జులు



లింగాలఘణపురం, జనవరి9: రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీసాయిభారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా 11 రోజులుగా భారత్ గ్యాస్ పంపిణీ పూర్తిగా నిలచిపోయింది. దీంతో ఈ ఏజెన్సీ పరిధిలోని పాలకుర్తి, లింగాలఘణపురం, స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెట, రఘునాథపల్లి మండలాలకు చెందిన భారత్ గ్యాస్ వినియోగదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భారత్ గ్యాస్ కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని 11 రోజులు పూర్తికావస్తున్నా ఇప్పటి వరకు అతీగతీ లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రఘునాథపల్లి భారత్‌గ్యాస్ ఏజెన్సీ పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లు కేజీబీవీ, మోడల్‌స్కూల్, ఎస్టీ, బీసీ హాస్టళ్లకు భారత్ గ్యాస్ కనెక్షన్లు కొనసాగుతుండగా ఆయా హాస్టళ్లల్లో గ్యాస్ సిలిండర్లు లేకపోవడంతో పిల్లలకు భోజనం వండడానికి నిర్వాహకులు నానా తంటాలు పడుతున్నారు. అయితే హాస్టల్ బిల్లులు నేరుగా గ్యాస్ ఏజెన్సీకి వెళ్లనుండగా బయట గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేసే అవకాశం లేకుండాపోయింది. దీంతో ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తమ ఇళ్లల్లో నుంచి గ్యాస్ సిలిండర్లు తీసుకువచ్చి వంట చేయిస్తున్నారు. మరోవైపు సాధారణ ప్రజలు పొరుగు మండలాల నుంచి బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏజెన్సీ పరిధిలో సుమారు 35వేల వినియోగదారులు ఉండగా మంగళవారం కేవలం 300 సిలిండర్‌లు మాత్రమే వచ్చాయి. వాటి కోసం వినయోగదారులు ఎగబడడంతో తోపులాట జరిగింది. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని వెంటనే రఘునాథపల్లి గ్యాస్ ఏజెన్సీ ద్వారా సిలిండర్లను డెలివరీ చేయించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తు న్నారు. అయితే భారత్ గ్యాస్ కంపనీకి డీడీలు చెల్లించకపోవడం కారణంగానే ఏజెన్సీకి సప్లై నిలిచిపోయినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి రోజారాణిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే తగు చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తానని అన్నారు.

బుగులు వెంకన్నకు సువర్ణ పుష్పార్చన



స్వామివారి పాదాలను 108 స్వర్ణ పుష్పాలతో అలంకరించిన దృశ్యం

చిలుపూర్, జనవరి 9 : చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజారులు స్వామి వారి పాదాలను 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనంతో పాటు, స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పూజారులు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు మాట్లాడుతూ ప్రతీ మంగళవారం నిర్వహించే సువర్ణ పుష్ప, అష్టదళ పాద పద్మారాధన పూజకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న, పూజారి కృష్ణమాచార్యులు, సిబ్బంది ఆడెపు రమేష్, వీరన్న. విశాల్, గాదె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పది జోన్లుగా మేడారం

పని విభజన చేసి సౌకర్యాలు కల్పించాలి

31లోగా మహాజాతర ఏర్పాట్లు పూర్తికావాలి

అధికారులను ఆదేశించిన మంత్రులు సీతక్క కొండా సురేఖ



మేడారం సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

ములుగు, జనవరి 9: ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతంగా జరిపించాలని, మొత్తం పది జోన్లుగా పనులను విభజించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. రూ.75 కోట్ల నిధులతో మొదలుపెట్టిన పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. పోలీసు, రెవెన్యూ, అటవి, రోడ్లు భవనాలు, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులతోపాటు హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన కలెక్టర్‌లు, ఎస్పీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులు ప్రశాంతంగా వనదేవతలను దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. జంపన్నవాగులోని నీరు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాల న్నారు. తాగునీటి వసతిని మెరుగుపర్చాలని, క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది జరగకుండా చూడాలని అన్నారు. రూ.75 కోట్లకు అదనంగా మరో రూ.30 కోట్ల కోసం అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించి వెంటనే నిధులను విడుదల చేస్తామని చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేస్తేనే జాతర సక్సెస్ అవుతుందని అన్నారు.

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళా భక్తుల రద్దీ పెరిగే అవకాశ ముందని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు మెరుగు పర్చాలని తెలిపారు. ఈసారి 6 వేల బస్సులను నడిపించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. జాతర నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులను గుర్తించా లని, వారు రాష్ట్రంలోని ఏ జిల్లాలో ఉన్నా ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. గత జాతరలలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతరను ప్లాస్టిక్ రహితంగా జరిపించా లన్నారు. రోడ్ల మరమ్మతులను సత్వరమే పూర్తిచేయాలని, ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతరలో తప్పిపోయిన వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేలా కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.

దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆదివాసీ సంప్రదాయాలకు అత్యంత ప్రాముఖ్యత నిస్తూ జాతర జరిపించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మహాజాతర విశిష్టతపై డాక్యుమెంటరీని రూపొందించాలని అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. 400 సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. ఈ సమీక్షలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఇటీవల ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఎస్పీ గౌష్ ఆలం, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన సామాజిక సేవా శిఖరం

- గుండెపోటుతో రామా శ్రీనివాస్ కన్నుమూత
- మోక్షారామం ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు
- హైదరాబాద్‌లో నివాళులర్పించిన కేటీఆర్, హరీష్‌రావు
- విషాదంలో ఓరుగల్లు.. నేడు అంత్యక్రియలు



రామా శ్రీనివాస్ (ఫైల్)

వరంగల్ కలెక్టరేట్, జనవరి 9: సామాజిక సేవా శిఖరం నేలకొరిగింది. పిలిచిన వెంటనే తానున్నానంటూ ఎందరికో అండగా నిలిచిన మానవతా మూర్తి కన్నుమూశారు. సామాజికసేవను జీవితంలో ఒకభాగంగా మలుచుకున్న ఆదర్శనీయుడు కనుమరుగైపోయారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక సేవకుడు రామా శ్రీనివాస్(59) హైదరాబాద్‌లో మంగళవారం గుండెపోటుతో కన్నుమూయడంతో ఓరుగల్లు విషాదంలో మునిగిపోయింది. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందారు.

వరంగల్ రామన్నపేటలో జన్మించిన శ్రీనివాస్‌కు భార్య శోభారాణి, కుమారుడు శైలేష్, కూతురు స్వాతి ఉన్నారు. నలుగురు సోదరులు, సోదరి ఉన్నారు. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ పేద ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ అభివృద్ధికి పాటుపడ్డారు. 2016 నుంచి సేవా కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చుచేశారు. రామన్నపేటలో మోక్షారామం ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలతో శ్మశాన వాటికను అభివృద్ధి పర్చి అందమైన గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ఇల్లులేని వారు కుటుంబ సభ్యులు ఎవరైనా అకాల మృతి చెందితే వారి దహన సంస్కారాలు, కర్మకాండలు పూర్తయ్యే వరకు ఉచితంగా ఉండటం కోసం శ్మశాన వాటికలో నాలుగు గదులు నిర్మించారు.

వృద్ధులు, ఒంటరి వారు, దివ్యాంగుల కోసం అమ్మఒడి భవనంలో నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పండుగలు, సంస్కృతీ సంప్రదాయాలు, బొడ్డెమ్మ, బతుకమ్మ, దసరా, సంక్రాంతి ముగ్గులు కార్యక్రమాలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేసే వారు. నిరుపేద ఆడపిల్లల కుటుంబాలకు వివాహానికి బంగారు పుస్తే, మట్టెలు, బట్టలు, నగదు సహాయం చేసేవారు.

కరోనా సమయంలో ప్రతీరోజు ఆస్పత్రులకు , పోలీసు సిబ్బందికి వేయి మందికి ఆహారం అందించారు. నగర ప్రజలు ప్లాస్టిక్ వాడొద్దని బట్ట సంచులు కుట్టించి ఇంటింటికీ వితరణ చేశారు. చెత్త కోసం ఉపయోగించడానికి ప్రతీ ఇంటికి రెండు డస్ట్ బిన్‌లు ఇచ్చారు. నగరంలో చెత్త తీసుకెళ్లడానికి దాదాపు రూ. కోటితో 420 రిక్షాలను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయానికి అందజేశారు. ఆలయాలకు , స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందజేశారు. రామన్నపేట ప్రజల కోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి కేవలం నాలుగు రూపాయలకే 20 లీటర్ల మంచినీరు అందిస్తున్నారు.



హైదరాబాద్‌లో శ్రీనివాస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీష్‌రావు

నగరంలో విషాదచాయలు..

రామా శ్రీనివాస్ ఇక లేరనే వార్త తెలిసి వరంగల్ వాసులు, మోక్షారామం, అమ్మ ఒడి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. పద్మశాలీ కుల బాంధవులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజనీర్లు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

కేటీఆర్, హరీష్‌రావు నివాళి..

శ్రీనివాస్ అకాల మృతి విషయం తెలియగానే టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు హుటాహుటిన హైదరాబాద్ సోమాజిగూడలోని శ్రీనివాస్ నివాసానికి వచ్చి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితోపాటు పలువురు ప్రముఖులు, అధికారులు శ్రీనివాస్ భౌతిక దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి వరంగల్ నగరానికి శ్రీనివాస్ భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. బుధవారం ఉదయం రామన్నపేటలోని మోక్షారామం ఫౌండేషన్ ఆధ్వర్యంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖులతో సంబంధాలు

పారిశ్రామికవేత్తగా, సేవాతత్పరుడిగా ఉన్న శ్రీనివాస్ దేశంలో, రాష్ట్రంలో పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కేసీఆర్‌తో పాటు దివంగత మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతోపాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పద్మశాలీ ప్రముఖులకు సుపరిచితుడిగా ఉన్నారు.

పదిరోజుల్లో సీఎంఆర్ టార్గెట్ పూర్తి చేయాలి

మిల్లర్లకు కలెక్టర్ శివలింగయ్య ఆదేశాలు

లింగాలఘణపురం, జనవరి 9: పదిరోజుల్లో (కస్టమ్ మిల్లింగ్ రైస్) సీఎంఆర్ టార్గెట్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ శివలింగయ్య మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం లింగాలఘణపురం మండలం కిష్టగూడెం శివారులోని శ్రీవిజయ దుర్గా రైస్‌మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సీఎంఆర్ టార్గెట్లను పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో రోజారాణి, డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి..

దేవరుప్పుల: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్ లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ శివలింగయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన దేవరుప్పుల మండలపరిషత్తు కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు దొర్లకుండా చూడాలని, లేదంటే అర్హులకు పథకాలు అందక గొడవలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ హుస్సేన్, ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



కిష్టగూడెం రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ శివలింగయ్య

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

జనగామ టౌన్, జనవరి 9: ఎవరైనా గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా మంగళవారం సాయంత్రం జనగామ రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో జనగామ సబ్ డివిజన్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కిరాణా, పాన్, తదితర షాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గంజాయి నిర్మూలనకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంన్నారు. ఎక్కడైనా విక్రయాలు చేస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ సీఐ శ్రీనివాస్‌యాదవ్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు సృజన్, అరుణ్, తిరుపతి, మాచర్ల శ్వేత, శ్రీకాంత్, నరేశ్, సతీశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూనూరులో వైభవంగా పుష్పయాగం

శ్రీగోదా రంగనాథస్వామికి పుష్పాలంకరణ

జఫర్‌గడ్, జనవరి 9 : మండలంలోని కూనూరులో గల శ్రీరంగనాథస్వామి ఆలయంలో మంగళవారం పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రజలు సుభిక్షంగా.. సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఆలయంలో ఏటా స్వామివారికి వివిధ రకాల పూలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా వేద పండితులు జనార్ధనాచార్యులు, బాలాజీ నేతృత్వంలో శ్రీగోదాదేవి-రంగనాథస్వామి వార్లను చామంతి, సంపంగి, కనకాంబరం, విరజాజి, జాజి, మల్లి, గులాబీలు, బిల్వ, కమలం, వంటి రకరకాల పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించి వేద మంత్రాల మధ్య పుష్పకైంకర్యం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి విశిష్ట పూజలు, అర్చనలు గావించారు. మధ్యాహ్నం స్వామి దంపతులకు పలురకాల పుష్పాలు, పత్రాలను సమర్పించారు. పుష్పయాగ మహోత్సవం శాస్త్రోయుక్తంగా కనులపండువగా సాగింది. ఆలయ ధర్మకర్త వకుళాదేవి, భక్తులు, మహిళలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



కూనూరులో శ్రీగోదా రంగనాథస్వామికి పూజలు చేస్తున్న పండితుడు

2 రోజుల పాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, జనవరి 9: రైల్వే మూడోలైన్ నిర్మాణాల పనుల దృష్ట్యా బుధవారం, గురువారం రెండు రోజులపాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైల్వే గేటు ద్వారా ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని తెలిపారు. శుక్రవారం నుంచి యథావిధిగా ఈ గేటు తెరిచి ఉంటుందని చెప్పారు.

ఎంబీఏ మూడో సెమిస్టర్ ఫీజు గడువు 22

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలఫీజులు జనవరి 22 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధి కారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జనవరి 24వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ అభ్యర్థులందరూ ఫీజుల చెల్లించుకోవాలన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 5గురు డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 9: కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1,3,5వ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ ఎం.తిరుమలదేవి తెలిపారు. డీబారైన వారిలో ఉమ్మడి ఖమ్మంలో -2, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3 మంది డీబారైనట్లు తెలిపారు. వీరిపై చర్యలుంటాయని తెలిపారు.

నూతన పెన్షన్ విధానాన్ని

రద్దు చేయకుంటే సమ్మె చేస్తాం..

మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్



మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాస్

కాజీపేట, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయకుంటే సమ్మె చేయడానికైనా సిద్ధమని దక్షిణ మధ్య రైల్వే జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ లోకో బ్రాంచ్ ఛైర్మన్ పాక వేదప్రకాశ్ ఆధ్వర్యంలో డీజిల్ షెడ్ వద్ద రెండో రోజు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను కాల్వ శ్రీనివాస్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. రైల్వే కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని కార్మికులు వారి కుటుంబాలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికుల పక్షాన ఉన్న పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతిస్తామన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో బ్రాంచ్ నాయకులు ఎస్.కె. జానీ, తిరుపతి, ప్రదీప్‌రాయ్, యాదగిరి, పి.రవి కిరణ్, నరేష్ యాదవ్, మాషుక్ జానీ, ఎ.సదానందం, జి.నాగరాజు ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న పోలీసు అధికారులు

అభినందించిన సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ క్రైం, జనవరి 9: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు వరంగల్ ఎస్‌బీ ఏసీపీ మూల జితేందర్‌రెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీ కె.సంజీవ్‌లను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. మంగళవారం సీపీ కార్యాలయానికి పిలి పించి ఇద్దరు అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ నెల 5 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో సత్తాచాటారు. 55 యేళ్ల విభాగంలో జితేందర్‌రెడ్డి సింగిల్స్, మిక్స్ డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా, 60 యేళ్ల విభాగంలో సంజీవ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరిని జాతీయస్థాయి పోలీసు క్రీడలకు ఎంపిక చేసినట్టు నిర్వాకులు తెలిపారు. సత్తాచాటి పతకాలు సాధించిన క్రీడాకారులను వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు, సిబ్బంది అభినందించారు.



పోలీసు క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ

ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కాళోజీ జంక్షన్, జనవరి 9: దేశ వ్యాప్తంగా ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని కోరుతూ హనుమకొండ రాంనగర్‌లోని వరంగల్ గ్రామీణ వికాస బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట బ్యాంకు ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కారింగ్ భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ వికాస బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వాటి పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టికి తెచ్చేందుకు ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బ్యాంకులో 20 యేళ్లుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న సుమారు 700మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని గ్రామీణ వికాస బ్యాంకులను స్పాన్సర్ బ్యాంకుల నుంచి విడదీయాలని, మ్యాన్ పవర్ పాలసీ ప్రకారంగా ప్రమోషన్లు, నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేగాక వాణిజ్య బ్యాంకుల మాదిరిగా ఉద్యోగులకు గ్రాట్యుటీ బేసిక్‌పే, డీఏ కలిపి చెల్లించాలని అన్నారు. ధర్నా అనంతరం ఉద్యోగ సంఘం నాయకులు బ్యాంకు జనరల్ మేనేజర్ దయాకర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జయరాములు, కుంభం వెంకట్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వీరయ్య, మల్లయ్య, రమేష్, తిరుమలేశ్వర్‌రావు, ఉభయ సంఘాల కోర్ కమిటీ సభ్యులు, ప్రాంతీయ కార్యదర్శులు సుమారు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న ఏపీజీవీబీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షమయ్య గౌడ్

సంక్రాంతి కీడు అంటూ..

● పల్లెల్లో ఐదు రకాల గాజుల సెంటిమెంట్
● మూఢనమ్మకాలను పట్టించుకోవద్దంటున్న విద్యావంతులు

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 9 : ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ కీడుతో వచ్చిందంట..! అందుకని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఇద్దరు కుమారులు కలిగిన తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఐదు రకాల గాజులను వేయించుకోవాలి, లేదంటే ఒక్క కొడుకుకు కీడు తప్పదు. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఓ వైపు ప్రపంచం సైన్స్ పరంగా అభివృద్ధిలో దూసుకుపోతోంటే ఈ ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి అసత్య మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగ రాబోతున్న వేళ తాజాగా ఈ ప్రచారం షికారు చేస్తోంది. ఇద్దరు కుమారులు ఉన్న తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఐదు రకాల గాజులు కొనుక్కోవాలంట..! అవి మళ్లీ ఒక కొడుకు ఉన్న వారితోనే వేయించుకోవాలంట.. ఈ వింత ప్రచారం పల్లెల నుంచి పట్టణాలకు పాకింది. మహిళలు ఈ ప్రచారాన్ని నమ్ముతూ.. గాజుల షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉండగా సైన్స్ ఉపాధ్యాయుడు, మండల నోడల్ అధికారి చీర భిక్షపతి ఈ వింత ప్రచారాన్ని నమ్మొద్దని సూచిస్తున్నారు. ఆధునిక యుగంలో ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దన్నారు. గతంలో సైతం సంక్రాంతి, ఉగాది పండుగల ముందు వదిన, మరదళ్ల గాజులు, అన్నదమ్ముళ్లకు కుడుకలు, ఆడబిడ్డలకు కుంకుమభరణాలు, చీరలంటూ ప్రచారాలు జరిగాయని, ఇలాంటి వాటిని ప్రతీ ఒక్కరు ఖండించాలని భిక్షపతి కోరారు.

నిట్‌లో కేర్ ఆస్పత్రి వైద్యశిబిరం

కాజీపేట, జనవరి 9: నిట్‌లో మంగళవారం హైదరాబాద్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్ హరీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి హాజరై నిట్ సిబ్బందికి, స్టూడెంట్స్‌కు సుమారు 150 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో నిట్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఊరట

● వన్య ప్రాణుల దాడిలో ధ్వంసమైన పంటలకు పరిహారం పెంపు
● అధికారుల సహకారం కోసం రైతుల ఎదురుచూపులు

గూడూరు, జనవరి 9: వన్యప్రాణుల దాడులతో నష్టపోయిన వారికి ఇచ్చే నష్టపరిహారాలను పెంచుతూ రాష్ట్ర అటవీశాఖ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఏజెన్సీ గ్రామాలు అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో వ్యవసాయక్షేత్రాలకు రైతులు వెళ్లిన సమయంలో తరుచూ వన్యప్రాణుల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే వన్యప్రాణులు వేల ఎకరాల్లో పంటలను నష్టం చేస్తున్నాయి. గతంలో నష్టపరిహారానికి ఉత్తర్వులు ఉన్నప్పటికి కొందరికే పరిహారం మంజూరైంది. రెండేళ్లుగా పంటనష్ట పరిహారానికి సంబంధించి దరఖాస్తులను తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వన్యప్రాణుల వల్ల జరిగే నష్టానికి పరిహారం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో ఏజెన్సీ ప్రాంత సాగు రైతులకు కొంతమేర మేలు జరుగనుంది.

15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో రైతులు 15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1.50 లక్ష హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. జిల్లాలోని పలు గ్రామాలు ఏజెన్సీ గ్రామాలు, అటవీప్రాంతాలకు దగ్గరగా ఉండడం ద్వారా అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. ఈ సీజన్‌లో సుమారు 19 నుంచి 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జ రుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. పరిహారం పొం దడంపై అవగాహన లోపం, త్వరగా మంజూరు కాకపోవడంతో చాలామంది గిరిజన, గిరిజనేతర రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు కూడా చేసుకోవడం లేదు. రైతులు రాత్రి, పగలు కష్టపడుతున్నా వన్యప్రాణుల నుంచి పంటలను మాత్రం కాపాడుకోలేకపోతున్నారు. అడవి పందులు పంటల యొక్క వాసన పసిగట్టే గుణం కలిగి ఉంటాయి. మొక్కల ఉనికిని అవి దూరం నుంచే పసిగట్టి గుంపులు గుంపులుగా పంటక్షేత్రాల్లో చొరబడి పంటలను ధ్వంసం చేస్తుంటాయి. చేనులకు కాపలాగా ఉన్న రైతులు పందులను తరిమికొట్టే సమయంలో వాటిదాడిలో తీవ్రంగా గాయపడతారు. దీంతోపాటు ఇతర క్రూరమైన జంతువుల దాడిలో పశువులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

అంచనా వేయడంలో జాప్యం

అడవి పందుల దాడులతో జరిగిన నష్టానికి పరిహారం రావాలంటే దరఖాస్తు చేసుకున్న రైతుల పంట క్షేత్రాలను అటవీ అధికారులు సందర్శించి, నష్టం అంచనా వేయాల్సి ఉంది. అయితే సకాలంలో వారు రాకపోవడంతో పరిహారంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దరఖాస్తు సమయంలోనే రెవెన్యూ, వ్యవసాయ, అటవీశాఖ అధికారుల నివేదికలు జతచేసి పంపిస్తున్నా విచారణ పేరుతో నెలల తరబడి ఫైల్ ముందుకు కదలడం లేదు. యేటా ఎంతోమందికి పరిహారం ఇచ్చారనేది కూడా అధికారుల వద్ద సమాచారం లేకపోవడం గమనార్హం. వన్యప్రాణుల దాడిలో మనుషులు మృతిచెందితే గతంలో రూ.5లక్షల పరిహారం ఉండగా, ప్రస్తుతం దానిని రూ.10లక్షలకు పెంచారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.75వేలు ఉంటే ప్రస్తుతం రూ.లక్ష, పంటనష్టం జరిగితే ఎకరాకు గతంలో రూ.6వేలు ఉంటే ఇప్పుడు రూ.7,500, పశువులు చనిపోతే గతంలో రూ.20 వేలు ఉండగా ప్రస్తుతం రూ.50 వేలకు పెంచారు.


గూడూరు అభయారణ్యంలో సంచరిస్తున్న అడవిపందులు(ఫైల్)


సీతానగారంలో అడవి పందుల సంచారంతో ధ్వంసమైన మొక్కజొన్న పంట (ఫైల్)

పరిహార నిబంధనలు ఇవే..

అటవీ జంతువులతో ప్రమాదం జరిగినా, వ్యక్తులు మృతి చెందిన, పంటలకు నష్టం వాటిల్లినా.. సంబంధిత అటవీశాఖ నుంచి పరిహారం పొందవచ్చు. అయితే పాములు, కోతుల కారణంగా మృతి చెందినా, గాయపడ్డ పరిహారానికి అర్హత ఉండదు. కేవలం వన్యప్రాణుల దాడిలో జరిగిన నష్టానికి పరిహారం పొందవచ్చు. సంఘటనలు జరిగిన ఒకట్రెండురోజుల్లో సంబంధిత అటవీశాఖ రేంజ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ అధికారి, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పంటనష్టం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తారు. వారు విచారణ జరిపి బాధితులకు నష్టపరిహారం మంజూరు చేస్తారు. కాగా, క్షేత్రస్థాయిలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు వేర్వేరుగా వన్యప్రాణుల దాడుల్లో ధ్వంసమైన పంట క్షేత్రాలను పరిశీలిస్తున్నారు. ఇలా ఒక్కొక్క అధికారి చుట్టు రైతులు తిరగాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది.

రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 9: రైల్వే కార్మికులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రైల్వే కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని మంగళవారం రెండో రోజు రిలే దీక్షలు చేశారు. ఈ దీక్షలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రారంభించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో సైతం మోదీ ప్రభుత్వం ఆటలాడుకుం టోందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే నని, అనంతరం ఉద్యోగులకు అన్నివిధాలుగా న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొత్త మురళీ కృష్ణ, కేంద్ర కమిటీ సభ్యుడు చింతమురళి, సాధినేని వెంకటనారాయణ, ఐఎన్‌టీయూసీ జిల్లా సెక్రటరీ, రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, అభిలాష్, ముస్తాక్ హుస్సేన్, బలివేందర్ సింగ్, లక్ష్మీనారాయణ, రాజలింగం, స్థానిక కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, గోల్కొండ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు ఎం.డి.అంకూస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి


హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు బాధ్యతలు

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఇప్పటివరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నుంచి కేయూ హాస్టల్స్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, దూరవిద్య కేంద్రం పీఆర్‌ఓ డాక్టర్ సంగాల ఎడ్వర్డ్‌రాజ్, కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, తదితరులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.


డైరెక్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న శ్రీధర్‌కుమార్‌లోథ్, చిలువేరు రాజ్‌కుమార్ తదితరులు

ఐటీసీ చేతికి బిల్ట్!

● పేపర్‌మిల్లు, ఆహార ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు అవకాశం ● నెలరోజులుగా కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు ● అందుబాటులో 750 ఎకరాల భూములు ● మంత్రి సీతక్క చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు



బిల్ట్ ప్రధాన గేటు

ములుగు, జనవరి 9: ఎట్టకేలకు బిల్ట్‌కు మంచిరోజులు రాబోతున్నాయి. మూడు దశాబ్దాలపాటు వెలుగు వెలిగిన ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీ పదేళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. కార్మికులకు, పరోక్షంగా ఆధారపడ్డ వారికి ఉపాధిని దూరం చేసింది. ఆశలు అడుగంటిన క్రమంలో ఐటీసీ సంస్థ ముందుకు వచ్చింది. ఇక పునరుద్ధరణ ప్రక్రియ చకాచకా సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో పాత పేపర్ మిల్లు స్థానంలో మళ్లీ పేపర్, ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను నెలకొల్పుతారని తెలుస్తోంది.

ఐటీసీ ద్వారా బిల్ట్ పునరుద్ధరణ

పారిశ్రామిక రంగంలో ఐటీసీ సంస్థకు దేశీయంగా మంచి పేరు ఉంది. 2014లో బిల్ట్ మూతపడ్డప్పటి నుంచి ఈ సంస్థపైనే అందరి దృష్టి మరలింది. పేపర్‌తోపాటు ఆహార ఉత్పత్తుల తయారీలో ఐటీసీ విస్తరించగా బిల్ట్ పునరుద్ధరణ ఈ సంస్థతో సాధ్యమవుతుందని సర్వత్రా భావించారు. సుదీర్ఘ కాలం తర్వాత ఎట్టకేలకు ఐటీసీయే ముందుకు రావడం గమనార్హం. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) తీర్పు తర్వాత బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ కంపెనీతో జరిపిన చర్చలు సఫలీకృతమైనట్లు సమాచారం. ఇటీవల పలు దఫాలుగా ఐటీసీ ప్రతినిధులు కమలాపురం వచ్చి సర్వేలు కూడా చేపట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని ఇరు సంస్థల ప్రతినిధులు కలవడం, బిల్ట్‌ను నడిపించేందుకు ఐటీసీకి ప్రభుత్వం పక్షాన పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించడంతో త్వరలోనే ఫ్యాక్టరీలో సైరన్ మోగుతుందనే తెలుస్తోంది.

బిల్ట్ స్థిరాస్తి 750 ఎకరాలు

బిల్ట్ సంస్థకు కమలాపురంలో 750 ఎకరాల భూములు ఉన్నాయి. 600 ఎకరాల్లో ఫ్యాక్టరీ, 150 ఎకరాల్లో కాలనీ, ఆస్పత్రి, అతిథిగృహాలు, పాఠశాల (థాపర్ విద్యావిహార్), స్టాఫ్‌క్లబ్ నిర్మాణాలు ఉన్నాయి. ఇవన్నీ ఎం.ఎల్.థాపర్ పేరిట ఉండగా ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పు తర్వాత ఫిన్‌క్వెస్ట్ కంపెనీ ఆధీనంలోకి వెళ్లాయి. ప్రస్తుతం భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చివేసి అవసరాలకు అనుగుణంగా నూతన నిర్మాణాలు చేసుకోవచ్చు.

కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు

పదేళ్లుగా యంత్రాలు నడవకపోవడంతో తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఇటీవలికాలంలో కొన్ని దొంగిలించబడ్డాయి. చోరీలకు పాల్పడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి సామగ్రిని పట్టుకున్నారు. ఈనేపథ్యంలో ఫ్యాక్టరీలోని పాత యంత్రాలను ఫిన్‌క్వెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. నెలరోజులుగా కార్మికులు భారీ యంత్రాలను విడదీస్తుండగా వాహనాల్లో తరలిస్తున్నారు. ఆరు నెలల కాల వ్యవధిలో పాత యంత్రాల తొలగింపు పూర్తిచేసి ఐటీసీకి అప్పగించేలా ఆసంస్థ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ఉపాధికి ఊతం

బిల్ట్ ఫ్యాక్టరీ తిరిగి తెరుచుకుంటే స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఉన్నత విద్యార్హత ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక చాలా మంది పట్టణాలకు వెళ్తున్నారు. కొందరు పొరుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. బిల్ట్‌తో అలాంటి వారందరికీ ఉద్యోగాలు లభిస్తాయనే ఆశ కలుగుతోంది. పరోక్షంగా వందలాది కుటుంబాలకు ఉపాధి కలగనుంది. కర్మాగారం లేఆఫ్ ప్రకటించిన తర్వాత 670 మంది పర్మినెంట్ కార్మికులు మిగిలారు. గడిచిన పదేళ్లలో 58 మంది వివిధ కారణాలతో మరణించారు. 37మంది ఉద్యోగ విరమణ పొందారు. ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాలతో ఇటీవల వీరి కుటుంబాలకు గ్రాట్యుటీ కింద వారివారి సర్వీసును బట్టి కొంత మొత్తాన్ని చెల్లించారు. 2020 వరకు సర్వీసును పరిగణలోకి తీసుకోవాల్సి ఉండగా 2015 డిసెంబరు కాలానికే ఇచ్చారని కార్మికులు చెబుతున్నారు. చట్ట ప్రకారం పూర్తి మొత్తంతోపాటు పెండింగ్ వేతనాలిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. కార్మిక కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు అర్హతను బట్టి ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీతక్క కృషిపై సర్వత్రా హర్షం

ములుగు ఎమ్మెల్యే సీతక్క రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల వ్యవధిలోనే బిల్ట్ ఫ్యాక్టరీపై సీఎం స్థాయిలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఫ్యాక్టరీని తెరిపించే విషయంలో 2014 నుంచి సీతక్క పోరాడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో గత ప్రభుత్వంపై అనేక పర్యాయాలు ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యంగా బిల్ట్ అంశాన్ని తీసుకుంటానని, ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు ఐటీసీ సంస్థను ఒప్పించి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహకారానికి భరోసా ఇప్పించారు. ఆ సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం, పాత యంత్రాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుండటం, ఏళ్లకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల గ్రాడ్యుయిటీ సెటిల్ కావడం వంటి అనుకూల పరిణామాలు చకాచకా చోటుచేసుకోవడంతో బిల్ట్‌కు మంచిరోజులు వస్తాయనే ఆశకు మరింత బలాన్నిస్తున్నాయి.


వెజిట్రబుల్స్

మండుతున్న కూరగాయల ధరలు

దేవరుప్పుల, జనవరి 9: కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో సామాన్యుడిపై అధిక భారం పడుతోంది. అటు కొనలేక.. ఇటు తినలేక సామాన్య నానా తంటాలు పడుతున్నారు. గతంలో కిలోకు వెచ్చించిన ధరతో ఇప్పుడు పావుకిలో కూడా రావడం లేదు. జిల్లాలో ప్రధానంగా జనగామ మార్కెట్‌తో పాటు మండలకేంద్రాలు, పలు గ్రామాల్లో నిర్వహించే సంతల్లో, కూరగాయల షాపుల్లో ధరలు మండిపోతున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు ఎక్కువగా కురిసి పంటలు కొట్టుకుపోవడంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లి మార్కెట్‌కు ఆంధ్రా, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి కూరగాయలు ప్రతీరోజూ లారీలు, డీసీఎంలు, టాటాఏసీ తదితర వాహనాలల్లో వస్తాం టాయి. పలు జిల్లాలతో పాటు జిల్లాకేంద్రంలోని మార్కెట్లలోని వ్యాపారులతో, పాటు ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వ్యాపారులు, పలు మండలాలు, పట్టణాలలో కూరగాయలు విక్రయించే వ్యాపారులంతా బోయిన్‌పల్లి మార్కెట్‌లో ప్రతీరోజూ కొనుగోలు చేస్తుంటారు. ఆంధ్రలో కూరగాయల సాగుకు నష్టం వాటిల్లడంతో తెలంగాణలో పంట దిగుబడి తక్కువ వస్తుండడంతో కూరగాయలు సరిపోకపోక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.



దేవరుప్పుల సంతలో కూరగాయలు కొంటున్న ప్రజలు



రోజు రోజుకూ ధరలు పైపైకి..

కూరగాయలు నెల పదిరోజులుగా పైపైకి పోతున్నాయి. టమాట కిలో ధర రూ. 30 ఉండగా, దోస, ఆలు కిలో 60కి అమ్ముతున్నారు. ఈ మూడు రకాలు మినహా మిగితా కూరగాయలు ఒక్కోటి కిలో 80నుంచి 120 వరకు పలుకుతున్నాయి. చిక్కుడు, బీరకాయల ధరలైతే దాదాపు ఓకెన్రోటుకు చేరువయ్యాయి. వాటి ధరలు కిలో 120కి పైగా పలుకుతూ ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. బెండ, గోకర, దొండ, క్యారెట్, బీట్‌రూట్ ఇతర కూరగాయల ధరలు కిలోకి రూ. 80వరకు విక్రయిస్తున్నారు. టమాట, పచ్చిమిర్చి జిల్లాలోని పలు మండలాల్లో (లోకల్)గా రైతులు పండిస్తుండటంతో టమాట 30, మిర్చి 60 రూపాయలకు కిలో విక్రయిస్తున్నారు. ఆకుకూరల పరిస్థితి అలాగే ఉంది. ఆకుకూరలైన పాలకూర, మెంతి, తోటకూర, చుక్కకూర ఏది కొన్నా కూడా రూ. 20నుంచి 30 రెండు కట్టల చొప్పున ఇస్తున్నారు. రూ.300 తీసుకుని కూరగాయల సంత, మార్కెట్‌కు వెళ్తే చిన్నపాటి చేతిసంచి కూడా నిండలేని పరిస్థితి నెలకొంది. వీటన్నింటికి తోడు జిల్లాలో కూరగాయల సాగు తగ్గుముఖం పట్టడంతో జిల్లా ప్రజల అవసరాలకు కూరగాయలు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

కొండెక్కిన కోడిగుడ్డు

రిటైల్ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర కూడా కూరగాయలతో పోటీ పడుతోంది. రెండు నెలల క్రితం కోడిగుడ్డు ధర రూ. 4.50 నుంచి 5 ఉంది. కానీ నెలరోజులుగా ఏకంగా 5.90నుంచి రూ.7కు పెరిగింది. మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న కోడిగుడ్లను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నందున వాటి ధర పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. రాష్ట్రంలో కరోనా కొత్త వేరియంట్ (జీఎన్-1)వ్యాప్తి చెందుతుండడంతో గుడ్లు తింటున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. రానున్న రోజుల్లో కూడా కోడిగుడ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉండనున్నట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం కూరగాయల ధరలు (కిలో..రూ.లలో)

రకం	హోల్‌సేల్	రిటైల్
టమాట	20	30
దోసకాయ	40	60
ఆలుగడ్డ	30	60
బీరకాయ	100	120
చిక్కుడుకాయ	100	120
బెండకాయ	60	80
వంకాయ	60	80
కాకరకాయ	60	80
గోకరకాయ	60	80
క్యారెట్	60	80
బీట్‌రూట్	80	100
క్యాబేజీ	30	50
ఆకుకూరలు (4కట్టలు)	20	40
కోడిగుడ్డు	5.90	7

టమాట ఒక్కటే ధర తక్కువగా ఉంది..

- కొత్త మాధవి, గృహిణి, నీర్మాల, దేవరుప్పుల మండలం



ప్రస్తుతం మార్కెట్లలో ఒక్క టమాట మాత్రమే ధర తక్కువగా ఉంది. కిలో ధర రూ. 30కి విక్రయిస్తున్నారు. దీంతో వాటినే కొనుక్కుని వాటికి కాసిన్ని పచ్చిమిర్చి జతచేసి పచ్చడి చేసుకుని తినే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి కూరగాయల ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 9: 132/33కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మండల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హుస్సేన్‌నాయక్ తెలిపారు. ఘన్‌పూర్, చిలుపూరు మండలాల పరిధిలోని తాటికొండ, ఫత్తేపూర్, మల్కాపూర్, రాజవరం, చిలుపూరు, చిన్నపెండ్యాల, నెమలిగొండ, తిమ్మంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

మార్కెట్‌కు సంక్రాంతి సెలవులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 9: ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు మార్కెట్‌కు సంక్రాంతి సెలవులు ఉన్నందున రైతు సోదరులు గమనించాలని మార్కెట్ సెక్రటరీ జన్ను భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తిరిగి జనవరి 17వ తేదీన మార్కెట్ పునఃప్రారంభమవుతుందని రైతు సోదరులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల ప్రగతికి పాటుపడాలి

జఫర్‌గడ్, జనవరి 9: ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి పాటుపడాలని నోడల్ అధికారి ఎండీ.పర్వేజ్ అన్నారు. మంగళవారం కూనూరు జడ్పీ హైస్కూల్‌లో టీఎస్‌పీఆర్‌టీయు నూతన సంవత్సర క్యాలండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు కె.సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేస్తూ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌పీఆర్‌టీయు రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు సుధాకర్, దయాసాగర్, లిల్లీమేరీ, శ్రీధర్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, కె.రవి, మంజుల, సోమయ్య, శ్రీనివాస్, గిరిజ పాల్గొన్నారు.

సిద్దేశ్వరుడి హుండీ ఆదాయం రూ. 4.05 లక్షలు

బచ్చన్నపేట, జనవరి 9: ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్దేశ్వరాలయ హుండీ లెక్కింపు మంగళవారం స్పెషల్ ఆఫీసర్ సుమతి, ఈవో వంశీ సమక్షంలో చేపట్టారు. రూ. 4.05 లక్షల ఆదాయం సమకూరినట్టు వారు తెలిపారు. సిద్దేశ్వరుడి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరిస్తూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, పూజారులు ఓంనమఃశివాయ, చల్లా రాజేందర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మధు, భానుప్రకాశ్‌రెడ్డి, మల్లం రాజమల్లయ్య లక్ష్మీ వెంకటసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ, ఐదు ట్రాక్టర్‌లు సీజ్

బచ్చన్నపేట, జనవరి 9: అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లతో పాటు, జేసీబీని అధికారులు సీజ్ చేశారు. బచ్చన్నపేటకు చెందిన పిల్లి రాములు వ్యవసాయ బావి నుంచి రమేశ్ తన ఇంటి నిర్మాణం కోసం మంగళవారం మట్టిని తరలిస్తుండగా తహసీల్దార్ విశాలాక్షి, ఎస్‌ఐ సతీష్ పట్టుకున్నారు. అక్రమంగా ఎవరు మట్టిని తరలించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

కలెక్టర్‌కు అయోధ్య అక్షింతల అందజేత

జనగామ టౌన్, జనవరి 9: శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అయోధ్య పూజిత అక్షింతలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నగర సంయోజక్ గునిగంటి రామకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టర్ శివలింగయ్యకు అక్షింతలు అందజేసి రామాలయ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ నెల 22న రామాలయం ప్రతిష్ఠ సందర్భంగా ప్రతీ హిందువు తమ ఇంటి ముందు దీపాలు వెలిగించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు బచ్చు బాలనారాయణ, నిరంజన్‌చారి, వితరణ ప్రతినిధులు సంతోష్, శ్రీరాముల మల్లేశ్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలంలోని హర్యాతండా గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలను మంగళవారం పంపిణీ చేశారు. మల్లంపల్లి గ్రామ సద్గురు నిత్యా నిర్మాలానంద డాక్టర్ సెలవోజు చంద్రమౌళి రాజయోగి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచు బానోతు మహేందర్, గర్వందుల మల్లేష్, కనకటి కొంరయ్య, బానోతు నెహ్రు, బాలాజీ స్వామి, గిరిధర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు అక్షింతలు అందజేస్తున్న హిందూ సంఘాల నాయకులు

బచ్చన్నపేట: అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ చేసిన అక్షింతలను మంగళవారం మండలంలోని ఆలీంపూర్‌తో పాటు గ్రామాల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఎండీ మసూద్, జ్యోతి భాస్కర్‌తో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు పాల్గొన్నారు.

ఐలోని జాతరకు రండి

సీఎంను ఆహ్వానించిన మంత్రి కొండాసురేఖ, ఎమ్మెల్యే నాగరాజు



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికతోపాటు మల్లన్న స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మంతి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జనవరి 9: లక్షలాది మంది భక్తులు కొలిచే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరా మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను కలిసి జాతర ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 14, 15 తేదీలలో జరిగే మహాజాతర తీరును వివరిస్తూ జాతరకు రావాలని కోరుతూ ఆలయ అర్చకులు కోరుతూ స్వామి వారి చిత్రపటం, ప్రసాదం తోపాటు వేద ఆశీర్వచనం అందజేశారు.

కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో కిందటేడు ఫిబ్రవరి 16న 'హాత్‌సే హాత్ జోడో' పాదయాత్రలో భాగంగా ఐనవోలు ఆలయ సమీపంలో విడిదిచేశారు. మరుసటి రోజు స్వామి వారిని దర్శించుకొని పాదయాత్రను ప్రారంభించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగరాజుతోపాటు అర్చకులు సీఎంకు గుర్తుచేయగా సంతోషించారు. ఆహ్వానంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చేపల పెంపకంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 9: చేపల పెంపకంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి సూచించారు. మంగళవారం తాటికొండలో ఆయన నాబార్డ్ ఆర్థిక సహకారం, 'మారి' సంస్థ ద్వారా గ్రామంలో ఏర్పాటు చేసిన చేపల పెంపకం కేంద్రాన్ని నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఏపీజీవీబీ బ్యాంకు వ్యవస్థాపకులు రామిశెట్టి మురళి, జనరల్ మేనేజర్ రాజయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ మారి సంస్థ సహకారంతో జిల్లాలో రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, చిలుపూరు మండలాలకు చెందిన 240 మందికి చేపల పెంపకం పై అవగాహన కల్పించామన్నారు. మొదటి విడుతలో భాగంగా జిల్లాలో రెండు యూనిట్లను ప్రారంభించామని, వాటిలో స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని తాటికొండతో పాటు రఘునాథపల్లి మండలంలోని మేకలగట్టు గ్రామంలో కేంద్రాలను ప్రారంభించామన్నారు. దశలవారీగా శిక్షణ పొందిన మహిళలకు యూనిట్లను అందిస్తామన్నారు. యూనిట్ల ద్వారా మహిళలు ఏడాదికి మూడు నుంచి నాలుగు లక్షల ఆదాయం పొందవచ్చన్నారు. మారి సంస్థ అందిస్తున్న అవకాశాన్ని మహిళలు వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారపాక రాములు, మారపాక వెంకటస్వామి, బొంకూరి యాదగిరి, నారబోయిన శ్రీనివాస్, మారపాక సంపత్, బలిజ రాజు తదితరులు పాల్గొన్నారు.



చేపల పెంపకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధీర్ రెడ్డి

యువత అవకాశాలను వినియోగించుకోవాలి

● సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి

జనగామ కల్చరల్, జనవరి 9: అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని యువత ఎదగాలని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ) డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం జనగామ జిల్లా యశ్వంతాపురంలోని సీజేఐటీలో నెహ్రూ యువకేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో 'మై భారత్ వికసిత్ భారత్' అనే అంశంపై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించగా విజయపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలు అంది పుచ్చుకునేందుకు నెహ్రూ యువకేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీలలో గనియా నాజ్ జిల్లా స్థాయి విజేతగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి సుధాకర్, అనిత, సయాబేగం, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా నాగరాజు, దేవేందర్ పాల్గొన్నారు.



జిల్లా స్థాయి విజేతకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న యువజన అధికారి అన్వేష్, కళాశాల యాజమాన్యం తదితరులు

కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలుపుకోవాలి

కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమల్లయ్య



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

బచ్చన్నపేట, జనవరి 9: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు, గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంఘం క్యాలెండర్‌ను ఎస్‌ఐ సతీష్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటమల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం జిల్లా కేంద్రంలో ఐదు ఎకరాల భూమి ఇచ్చి అందులో సర్వాయి పాపన్నగౌడ్ మ్యూజియం నిర్మించాలని, జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, చనిపోయిన గీత కార్మికుల కుటుంబాలకు నెల రోజుల్లో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 50 ఏళ్ల నిండిన గీత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరంధాములు, నల్లగోని బాలకిషన్‌గౌడ్, బండపల్లి శంకరయ్య, బొమ్మెన రాజయ్య, వెంకటయ్య, కృష్ణమూర్తి, రాములు, శ్రీనివాస్, రమేశ్, రాజు, భాస్కర్, దయాకర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బస్సెక్కుతూ జారిపడిన యువతి

తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 9: మండలంలోని శివునిపల్లి ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో ఓ యువతి కిందపడి తలకు గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివునిపల్లి గ్రామానికి చెందిన గోరంటల నాగరాణి సముద్రాల గ్రామానికి వెళ్లేందుకు శివునిపల్లి రైల్వేస్టేషన్ వద్ద పాలకుర్తి బస్సు ఎక్కుతున్న క్రమంలో ఒక్కసారిగా బస్సు ముందుకు కదలింది. దీంతో నాగరాణి పడిపోగా తలకు వెనుకాల గాయమైంది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా యువతి కిందపడినప్పటికీ డ్రైవర్ బస్సును ఆపకుండానే వెళ్లిపోయాడు. దీంతో పాలకుర్తికి వెళ్లి బస్సు తిరిగి వస్తున్న క్రమంలో బాధితురాలి కుటుంబ సభ్యులు అడ్డుకొని డ్రైవర్‌ను నిలదీశారు. ప్రమాదం జరిగినా పట్టించుకోకుండా పోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి బస్సును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.



గాయపడిన నాగరాణి

జనగామ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

జనగామ టౌన్, జనవరి 9: జనగామ జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు కోరారు. మంగళవారం జనగామలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల రెవెన్యూ డివిజన్, జనగామ ఇండస్ట్రియల్ కారిడార్, ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, మెడికల్ కళాశాలలో వసతుల కల్పన, జిల్లా ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత అంశాలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలన్నారు. లేదంటే ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తుంగ కౌశిక్, సల్లమహేశ్, వెంపటి అజయ్, నర్సింగ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

జీడికల్‌లో సీఎస్ వ్యక్తిగత కార్యదర్శి పూజలు



పూజలు చేస్తున్న గణేశ్‌జ్యోతికుమారి దంపతులు

లింగాలఘణపురం, జనవరి9: మండలంలోని సుప్రసిద్ధ జీడికల్ వీరాచల శ్రీరామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం తెలంగాణ చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి వ్యక్తిగత కార్యదర్శి గణేశ్‌జ్యోతికుమారి దంపతులుప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన, అభిషేకాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. వీరివెంట తహసిల్దార్ వినయలత, ఆలయ అధికారులు కెకె రాములు, భరత్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు.

మంత్రి సురేఖను కలిసిన టీఎన్‌జీవోస్



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

జనగామ టౌన్, జనవరి 9: మంత్రి కొండా సురేఖను జనగామ టీఎన్‌జీవోస్ నాయకులు రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ మాట్లాడుతూ.. త్వరలో జనగామ జిల్లాలో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని, మంత్రి సురేఖను రావాలని కోరారు. వారిలో పెండెల శ్రీనివాస్, ఎండీ.హఫీజ్, చింత రామనర్సయ్య, సాంబారి నాగార్జున, ప్రభాకర్ ఉన్నారు.

నాన్ మల్టీపర్పస్ వర్కర్ అదృశ్యం



యాదయ్య (ఫైల్)

బచ్చన్నపేట, జనవరి 9: మండలంలోని కట్కూరు గ్రామంలో నాన్ మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న తుడుం యాదయ్య (60) కనిపించడం లేదు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన యాదయ్య తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బచ్చన్నపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

'అధిక సాంద్రత సాగుతోనే లాభాలు'

తరిగొప్పుల, అక్టోబరు 4: అధిక సాంద్రత పత్తిసాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఏరువాక కేంద్రం యాద్రాద్రి భువనగిరి వారి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో రైతులకు ఏక కాలంలో పంట చేతికి వస్తుందని, అనంతరం రెండో పంట వేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్స్ వేణు, నిహారిక, సుమలత, దేశ్‌పాండే సంస్థ ప్రతినిధులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సైన్స్‌టాలెంట్ టెస్ట్‌తో శాస్త్రీయ దృక్పథం

లింగాలఘణపురం, జనవరి9: సైన్స్ టాలెంట్ టెస్ట్‌తోనే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని మండల నోడల్ అధికారి విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం లింగాలఘణపురం జడ్పీహెచ్ కాంప్లెక్స్ సమావేశంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న పాఠశాల స్థాయిలో, 27న మండలస్థాయిలో ఫిబ్రవరి 3న జిల్లాస్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈపోటీల్లో 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందని అన్నారు. ఇందులో విద్యార్థులు పాల్గొనే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు పద్మజ, అరుంధతి, శ్రీధర్, కరుణ, నిరంజని, ఆకుల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం వెంటనే పూర్తి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 9: శివునిపల్లి పట్టణంలో 18 ఏళ్ల క్రితం చేపట్టిన గిరిజన హాస్టల్ భవనం నేటికీ అసంపూర్తిగా ఉందని, వెంటనే పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవినాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీటీడీవో ప్రేమకళకు వినతి పత్రం ఇచ్చారు.

బాలకార్మికులను గుర్తించిన 'ఆపరేషన్ స్మైల్' టీమ్

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 9: బాలకార్మికుల వ్యవస్థను రూపుమాపడానికి ప్రభుత్వం చేబట్టిన అపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా టీమ్ ఇన్‌చార్జి ఎస్సై హరికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం శివునిపల్లిలోని పత్తిమిల్లులో పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామాల్లోని రైస్ మిల్లులు, పత్తి మిల్లులలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో ఎస్‌ఎస్‌సీ పత్తిమిల్లులో బిహార్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు బాలకార్మికులను గుర్తించినట్లు తెలిపారు. వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు అప్పగించగా వారు జఫర్‌గడ్ మండల పరిధిలోని ఆశ్రమానికి తరలించారని తెలిపారు.

లేబర్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతానికి కేసు నమోదు కాలేదన్నారు. లేబర్ అధికారుల విచారణ తరువాత బాలకార్మికులను పనిలో పెట్టుకున్నవారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా అధికారి స్వప్నరాణి, సిబ్బంది దేవరాజ్, రాజ్‌కుమార్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.